మజర్‌హుస్సేన్‌కు ఇంటర్నేషనల్ పీస్ అవార్డు


అవార్డు అందుకుంటున్న మజర్ హుస్సేన్

హైదరాబాద్ సిటీ, మార్చి12 (ఆంధ్రజ్యోతి): కాన్ఫెడరేషన్ ఆఫ్ వలంటరీ అసోసియేషన్(కొవ) స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మజర్ హుస్సేన్‌కు 'మజ కౌనె ఇంటర్నేషనల్ పీస్ అవార్డు -2024'ను స్విట్జర్లాండ్‌కు చెందిన 'సెంటర్ ఫర్ సోషియో కల్చరల్ ఇంటర్నేషన్ ఎ నాట్ ఫర్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్(సీఈఎస్‌సీఐ) మధురైలో మంగళవారం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి మార్గరెట్ హ్యాజెన్‌టోబ్లర్ ప్రశంసాపత్రాన్ని అవార్డు గ్రహీతకు అందజేశారు. మూడు దశాబ్దాలుగా హింస, మతకలహాల వంటి సమస్యలకు వ్యతిరేకంగా మజర్ చేస్తోన్న సేవలకు గుర్తింపుగా ఆయన్ను ఈ అవార్డుతో సత్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీఈఎస్‌సీఐ భారత అధ్యక్షుడు, మధ్యప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రెటరీ ఎస్‌సీ బెహర్‌తో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టర్ చిన్నారెడ్డి రైతు పక్షపాతి

● మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు


చిన్నారెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న మంత్రి తుమ్మల, సంఘం నాయకులు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ చిన్నారెడ్డిని మంగళవారం రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ(ఐఐఆర్ఆర్)లో రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. నలభై సంవత్సరాలుగా రాజకీయ జీవితంలో ఉన్న చిన్నారెడ్డి రైతు పక్షపాతి అని అన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ఆయన ఎప్పుడూ రైతులకోసం మాట్లాడే వ్యక్తి అని గుర్తు చేశారు. గత శాసనసభ ఎన్నికలలో చిన్నారెడ్డి వనపర్తి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచి ఉంటే ఆయనే వ్యవసాయశాఖ మంత్రి అయి ఉండేవారన్నారు. వ్యవసాయ రంగంపై అపూర్వ అనుభవం ఉన్న చిన్నారెడ్డి ఆలోచనలను తీసుకుని ముందుకు సాగుతానని తుమ్మల అన్నారు. ప్రభుత్వానికి పేరు వచ్చేలా వ్యవసాయశాఖ అధికారులు పనులు చేయాలని సూచించారు. అంతకుముందు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును డాక్టర్ చిన్నారెడ్డి భారీ గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ మీనాక్షీ రామన్ సుందరం, రాష్ట్ర వ్యవసాయశాఖాధికారుల సంఘం ఛైర్మన్ డాక్టర్ వైద్యనాథ్, అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విద్యాసాగర్, రిటైర్డ్ డీన్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 15, 16 తేదీల్లో నగరంలో పర్యటిస్తున్నందున ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్రపతి నిలయంలో పోలీస్, ఆర్‌అండ్‌బీ, ఫైర్, ఎనర్జీ, బీఎస్ఎన్ఎల్, ఐటీ, పీఆర్‌అండ్ ఆర్డీ, కంటోన్మెంట్ అధికారులతో నిర్వహించిన కో-ఆర్డినేషన్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు సీఈఓ, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ వెంకటి, ఏసీపీ వీవీఎస్ రామలింగరాజు, అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్‌రావు, అటవీశాఖ అధికారి జ్యోతి, ఆర్డీఓ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

పంజాగుట్ట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం యూసుఫ్‌గూడలోని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. 24 రోజుల సమ్మె హామీలు అమలు చేయాలని, ఒకపూట బడితోపాటు మే నెలంతా టీచర్లు, హెల్పర్లకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం నిర్వహించిన సమీక్షలో అంగన్‌వాడీల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పేద ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను అవినీతిపరులని ఆరోపించడం అన్యాయమని, ఈ నిర్ణయాన్ని సీఎం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో మైత్రివనం సిగ్నల్ వరకు ర్యాలీ నిర్వహించి, బైఠాయించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.కవిత, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సునీత, శోభ, సీఐటీయూ నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు.

అధిక అనస్తీషియాతో ల్యాబ్ టెక్నీషియన్ ఆత్మహత్య


రామునాయక్ (ఫైల్)

అల్వాల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ మృతిచెందాడు. అధికమొత్తంలో అనస్తీషియా (రోగికి ఇచ్చే మత్తుమందు) తీసుకోవడం వల్లే చనిపోయినట్టు తెలుస్తున్నది. ఈ సంఘటన మంగళవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అల్వాల్ ఎస్‌హెచ్‌ఓ రాహుల్‌దేవ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట్, బ్రాహ్మణపల్లికి చెందిన ఛత్రూనాయక్ కుమారుడు రామునాయక్ (27) గ్రేటర్ పరిధిలోని అల్వాల్‌లో ఉంటున్నాడు. స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గత పదేళ్లుగా అనస్తీషియా ఇచ్చే డాక్టర్ వద్ద సహాయకుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి తండ్రితో మాట్లాడిన రాము నాయక్ ఆస్పత్రిలో విధులకు హాజరవుతున్నట్లు తెలిపాడు. అయితే, మంగళవారం ఉదయం ఆస్పత్రిలోని ఐసీయూలో బెడ్‌పై అనుమానాస్పదస్థితిలో మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. రామునాయక్ చేతికి అనస్తీషియా ఇంజక్షన్ తీసుకుంటున్న ఆధారం గల సీసీ ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్కువ మొత్తంలో అనస్తీషియా తీసుకున్నందునే రామునాయక్ మరణించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

యాజమాన్యం ఒత్తిడి వల్లేనంటూ ఫిర్యాదు

ఆస్పత్రిలో పదేళ్లుగా పనిచేస్తున్న రామునాయక్‌కు యజమాన్యం నిత్యం నైట్ డ్యూటీలనే వేస్తూ మానసిక ఒత్తిడికి గురిచేసిందని అతని సోదరి పార్వతి ఆరోపించారు. ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలని గత మూడేళ్లుగా కోరుతున్నా ఆస్పత్రి యాజమాన్యం ఇవ్వకుండా అతన్ని వేధించిందని ఆమె మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. నెలరోజుల క్రితం ఆస్పత్రిలోనే అనస్తీషియా డోస్ తీసుకున్నప్పటికీ యాజమాన్యం తమకు సమాచారం ఇవ్వలేదన్నారు. రామునాయక్ మృతికి ఆస్పత్రి యాజమాన్య వైఖరే కారణమని ఆరోపిస్తూ కుటుంబసభ్యులతో కలిసి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్‌జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


మణెమ్మ పార్కులో ఓపెన్‌జిమ్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ వై.అమృత

నల్లకుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పార్కులలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్‌జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఉదయం అంబర్‌పేట నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. నల్లకుంట డివిజన్ టీఆర్‌టీ క్వార్టర్‌లో మణెమ్మ పార్కులో, కాచిగూడ డివిజన్ నెహ్రూనగర్, సమోస పార్కు, విక్రమ్‌నగర్ పార్కుల్లో ఓపెన్‌జిమ్‌లను ప్రారంభించారు. పార్కులో రూ. 6 లక్షల వ్యయంతో పవర్ బోరు ఏర్పాటు చేశారు. టీఆర్టీ కాలనీ వాసులు మంత్రిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వై. అమృత, కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, బీజేపీ నాయకులు శ్యామ్‌రాజ్ ముదిరాజ్, కె.లక్ష్మణ్‌కుమార్, బి.సురేష్‌యాదవ్, ఎం.మధుసూదన్‌యాదవ్, కన్నె రమేష్ యాదవ్, జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఓపెన్‌జిమ్‌ను ప్రారంభిస్తున్న డా. లక్ష్మణ్, కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

ముషీరాబాద్ అభివృద్ధికి కృషి : డా. లక్ష్మణ్

చిక్కడపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్ స్ట్రీట్‌నెంబర్ 4లో నిర్మించిన ఓపెన్‌జిమ్, అశోక్‌నగర్ వెల్ఫేర్‌సెంటర్ కమ్యూనిటీ హాల్‌కు అందజేసిన టేబుల్స్, అల్మారాలను ఎంపీ డా.లక్ష్మణ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ ఎ. పావని, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం


ఫ్రెండ్స్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

ముషీరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ కాలనీలో రూ. 9 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, కళాధర్‌నగర్‌లో రూ. 14 లక్షల వ్యయంతో చేపట్టనున్న పార్కు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠాగోపాల్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లకు మరమ్మతులతోపాటు, పార్కుల్లో ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ నాయకుడు ముఠా జైసింహ, బీజేపీ ముషీరాబాద్ జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఓపెన్‌జిమ్‌లకు నిధుల మంజూరుపై వాగ్వాదం

ముషీరాబాద్‌లో ఓపెన్‌జిమ్‌ల ఏర్పాటుకు తామే నిధులు మంజూరు చేయించామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ చెబుతుండగా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధుల నుంచి మంజూరు చేయించి ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఇరు పార్టీల నేతలు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.


డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

అశోక్‌నగర్‌లో రూ. 10 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైపులైన్

గోల్నాక, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ అశోక్‌నగర్‌లో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం కాలనీలో పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గండికోట జనార్దన్, ఆర్‌కే బాబు, ఎ. సురేష్‌గౌడ్, వై. బుచ్చిరెడ్డి, మహ్మద్ యూసుఫొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న డాక్టర్ చీమ శ్రీనివాస్

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఛైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఉద్యమకారులను గుర్తించడానికి కమిటీ ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, జూన్ 2న ఉద్యమకారులను సన్మానించాలని, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ. 10 వేల కోట్లు కేటాయించాలని, ఉచిత బస్‌పాస్, ఆరోగ్యబీమా, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ఉద్యమకారుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి పి.సురేందర్‌రెడ్డి, కన్వీనర్ అయిలయ్యయాదవ్, నాయకులు వెంకటేష్‌గౌడ్, జంగా సుదర్శన్, కొంతం వీరస్వామి, ఓరుగంటి ఆనంద్, కె.జనార్దన్, అఖిలేష్, నర్సింహారెడ్డి, మహిళా అధ్యక్షురాలు పి.జ్యోతి పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు : సుప్రియ

ముషీరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ డివిజన్‌లో మొరంబొంద, గంగపుత్రకాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో రూ. 11 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలకు కుర్చీలు, టేబుల్స్ అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచికుమార్, బీజేవైఎం నగర కార్యదర్శులు అనిల్ కుమార్, అజయ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ అండ్ ఎకనామిక్స్ విభాగాల్లో

ఓయూ-అంబేడ్కర్ కాలేజీ మధ్య అవగాహన ఒప్పందం


అవగాహన పత్రాలు చూపిస్తున్న ఓయూ, అంబేడ్కర్ కళాశాల అధ్యాపకులు

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం, అంబేడ్కర్ కళాశాలల మధ్య కామర్స్ అండ్ ఎకనామిక్స్ విభాగాలపై అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. మంగళవారం ఓయూ కామర్స్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ డి.చెన్నప్ప, ప్రొఫెసర్ వి.అప్పారావు, డీన్ ఫ్యాకల్టీ కామర్స్ ఎస్.కవితాదేవి, ప్రొఫెసర్ వి.నారాయణ, అంబేడ్కర్ విద్యా సంస్థల డైరెక్టర్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఒప్పందం పత్రాలు మార్చుకున్నారు. దీంతో కళాశాల విద్యార్థుల ఉన్నత విద్యకు తోడ్పాటును అందించే సెమినార్లు, వర్క్‌షాప్‌లు, గెస్ట్ లెక్చర్స్ ఇంటర్నెట్ షిప్స్ ట్రైనింగ్ సెషన్లకు ఓయూ కామర్స్, ఎకనామిక్స్ విభాగం సహాయ సహకారాలు అందించనుంది. అంబేడ్కర్ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో ప్రొఫెసర్లు విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. పరిశోధన పద్ధతులు, ప్రాజెక్టుల రూపకల్పన, కామర్స్ విద్య ఆవశ్యకతను వివరించారు.

బీసీల అభివృద్ధిని విస్మరించిన బీజేపీ, కాంగ్రెస్


మాట్లాడుతున్న బి. ప్రసాద్‌గౌడ్

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బీసీలను మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ను లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు ప్రసాద్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ బీసీల అభివృద్ధిని విస్మరించాయని ఆరోపించారు. బీసీలు ఓట్లు వేసే యంత్రాలుగా కాకుండా హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి భూపాల్, కోశాధికారి బోంపల్లి మధు, ఉపాధ్యక్షులు షేక్ అమానుద్దీన్, సుంకర్ లింగారెడ్డి, కార్యదర్శులు రాకేష్ నాయక్, శ్రీలత, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కుసుమ ధర్మన్న సాహితీ పురస్కారానికి ప్రొఫెసర్ తరపట్ల సత్యనారాయణ ఎంపిక

నల్లకుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కుసుమ ధర్మన్న సాహితీ పురస్కారానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తరపట్ల సత్యనారాయణను ఎంపిక చేశామని కళాపీఠం అధ్యక్షురాలు డాక్టర్ రాధా కుసుమ, కార్యదర్శి పి. బడే సాబ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న ఏపీలోని నన్నయ్య విశ్వవిద్యాలయంలో జరుగుతున్న మహాకవి కుసుమ ధర్మన్న 125వ జయంతి సందర్భంగా సత్యనారాయణకు రూ. 10,116, జ్ఞాపిక, సన్మాన పత్రం అందజేస్తామని పేర్కొన్నారు.

'నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి'

బర్కత్‌పుర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల ఫోరంలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కన్స్యూమర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మల్లు శివరాం డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కన్స్యూమర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సలహాదారు గొల్లపల్లి దయానంద్‌తో కలిసి మాట్లాడారు.

రామమందిర ప్రతిమల పంపిణీ

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం జెమినికాలనీలో ఇంటింటికి రామమందిర ప్రతిమలను బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీకాంత్, జమాల్‌పురి నందు, నీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధిలో శిక్షణ

కవాడిగూడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధిలో ఉచిత శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అలంకరణ, కేశాలంకరణ, క్రీమ్‌లు, కాస్మెటిక్స్‌పై శిక్షణ ఇచ్చారు. పలు సంఘాల నుంచి 30 మంది సభ్యులు పాల్గొన్నారు.


వివేక్‌ను సన్మానిస్తున్న గోపాల్‌రావు తదితరులు

ఆరె కటికల సమస్యల పరిష్కారానికి కృషి

బర్కత్‌పుర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆరెకటికల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. మాజీ కార్పొరేటర్ ఎస్.గోపాల్‌రావు ఆధ్వర్యంలో ఆయనకు మంగళవారం నింబోలిఅడ్డ ఏకే భవన్‌లో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ.. ఆరెకటికలను బీసీ-డి నుంచి బీసీ-ఏలో చేర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. కాచిగూడ, జియాగూడ, బోయిగూడ, గౌలిపుర కబేళాల పై ఆధారపడి జీవిస్తున్న ఆరె కటికల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, నాయకులు రమేష్‌కుమార్, పూల్‌దండి నర్సింగ్‌రావు, టి.నర్సింగ్, యశ్వంత్‌రావు, టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అంబేడ్కర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ కాలేజియేట్ పవర్ లిఫ్టింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎల్‌బీ స్టేడియంలో జరిగిన పోటీల్లో కళాశాల నుంచి 8 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కె. జగదీష్ గోల్డ్ మెడల్, ఎస్. సతీష్, ఎస్. వసీమ్ సిల్వర్, ఎండీ ఆసిఫ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. విజేతలను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మంగళవారం అభినందించారు.

గాంధీనగర్ సెక్టార్-2 ఎస్ఐగా హరీష్



కవాడిగూడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో సెక్టార్-2 ఎస్ఐగా హరీష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈ సెక్టార్‌లో విధులు నిర్వహించిన ఎస్ఐ జీవన్‌రెడ్డి నార్కోటిక్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో నేరాల నివారణకు కృషి చేస్తామన్నారు.

'క్రీమీలేయర్'ను రద్దు చేయాలి : టీఓబీసీఈఎఫ్

నల్లకుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ కులగణన చేపట్టడంతోపాటు క్రీమీలేయర్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ ఓబీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్(టీఓబీసీఈఎఫ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లం యాదయ్య డిమాండ్ చేశారు. మంగళవారం హైదర్‌గూడలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడంతోపాటు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వాలు స్పందించకపోతే పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

ధరణిలో లోపాలను సవరించాలి


మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి. సాగర్

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సమగ్ర భూ సర్వే నిర్వహించి ధరణిలో లోపాలను సవరించాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కోతినేని సుదర్శన్ అధ్యక్షతన రైతు సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న సాగర్ మాట్లాడుతూ.. వారసత్వంగా వచ్చిన ఆస్తిని వారసులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, సారంపల్లి మల్లారెడ్డి, జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని కోరారు.

సన్మానం


ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డిని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా, ప్రధాన కార్యదర్శి పి. బాల్‌రాజ్‌గౌడ్ మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కె. కిరణ్‌కుమార్, నాయకులు యాదగిరిగారు, సి. ప్రకాశ్, ఎడెల్లి భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.
- రాంనగర్/నల్లకుంట, ఆంధ్రజ్యోతి


రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాసరావును మంగళవారం తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు తదితరులు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.
- నల్లకుంట, ఆంధ్రజ్యోతి


గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీ అధ్యక్షుడిగా ఆరోసారి ఎన్నికైన మెరుగు శ్రీనివాస్ యాదవ్‌ను తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ జనసమితి నగర కార్యదర్శి పి. జయపాల్‌రెడ్డి, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు గుండెల్లి రవీందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.
- చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి